# ఒట్టు

ఆమె మెడ ఒంపులో అతని నులి వెచ్చని శ్వాస బుస కొడుతోంది. నరనరంలో కోరిక మెలి తిరుగుతోంది. నిండు కళ్ళతో ఆమెను తమకంగా తనివి తీరా చూస్తూ...

"చిత్రా ! నువ్వెంత అందంగా ఉన్నావో తెలుసా?... మామూలుగా కాదు... అన్నీ తప్పించి ఇట్లా చూస్తుంటే..." అంటూ మిగతా భావాన్ని పైకి చెప్పకుండా ముద్దుల ముద్ర వేసి పూర్తి చేశాడు.

"పిచ్చి మీకు... ఛీ... ఈ నెల బడ్జెట్ ఇంకా పెరిగి పోతోంది తెలుసా?... బంధువు లొచ్చి వెళ్ళారు కదా!... వాళ్ళతో బాటు తిరుగుళ్ళకి నాలుగు రోజుల ఖర్చు ఆరు వందలు..." నడుము నుంచి పైకి పాకుతున్న అతన్ని ఎలా ఆపాలో తెలీనట్టు జుత్తు లోకి వేళ్ళు పోనిచ్చి అవతలికి లాగింది.

"చిత్రా...మై స్వీట్...ఇంత అందాన్ని ఏం చెయ్యాలి?...ఎంత కవ్వింపుగా ఉన్నావో తెలుసా?..." అంటూ పెనవేసు కుంటున్నాడు, చేతులు చాలనట్టు తడుము కుంటున్నాడు.

"వీసీఆర్ కొనే పని ఏం చేద్దాం చెప్పండి? పోనీ... ఎక్కడైనా లోన్ ట్రై చెయ్యి కూడదూ?..." అంటూనే ఎగబడి వస్తున్న అతని పెదవుల్ని తప్పు కోవడానికి చటుక్కున ముఖం తిప్పుకుంది.

ఎప్పుడూ అంతే చిత్ర. ముఖం మీద మాత్రం ముద్దు పెట్ట నివ్వదు. పెదవి మీద పెదవి మోప నివ్వదు. వింత భయం. ముఖం చెడిపోతుం దట. అంత సేపూ వెంట్రుకలు సవరించు కుంటూనే ఉంటుంది.

తల తిప్పుతూనే ఉంది అటూ ఇటూ ఒడ్డున పడ్డ చేప పిల్లలా. "ప్లీజ్... ఒక్కసారి" అని గోపీ ఎంత బ్రతిమి లాడినా లాభంలేదు.

"వద్దంటే..." అంటూ ముఖం చిట్లించింది.

అతను చల్లారే ఆవేశాన్ని వెచ్చ జేసుకుంటూ మురిపాల ప్రయాణంలో ముందుకే వెళ్ళాడు.

అతిలోక సౌందర్యంతో మెరిసి పోతున్న ఆమె అణువణువులో తను కలిసి పోవాలని, తనలో అణువణువు మధ్యలో ఆమెను ఇముడ్చు కోవాలని ఆరాటం, పోరాటం... అమృతగానంలో అపశ్రుతిలా ఆమె మాటలు తగుల్తూనే వున్నాయి.

"ప్రొద్దున కూర లావిడతో యుద్ధమై పోయింది తెలుసాండీ... అన్నీ పుచ్చు కూర లిస్తోంది...మండిపోయే రేట్లు..." అంది గోపీ కళ్ళలో కోరిక రేగుతుండగా.... "పక్కింటి ఆంటీ స్టీలు గిన్నెల సెట్టు వాయిదాల మీద కొంటోంది... మనమూ కొందామా?"

"మా ఫ్రెండు సరస్వతి లెటర్ రాసింది... తన కిప్పుడు మూడో నెల... వాళ్ళాయనకి ప్రమోషన్ మీద తొందర లోనే ట్రాన్స్‌ఫర్ వస్తుందట...." అంది, గోపీ ఆమె పరువాల శిఖరాలమీద ముద్రలు వేస్తుండగా.

అతనికి అంతా కావాలి. ఇంకా కావాలి. సర్దుబాటు కావాలి. చిన్న చిన్న మురిపాలు. ముద్దుముద్దు ముచ్చట్లు. చెవిలో చిన్నగా గొణిగాడు.

ఆమె అయిష్టంగా కదుల్తూ "పోనీ మనం కూడా షేర్ సర్టిఫికెట్స్ కొందామా... డబ్బు రెండింతలు మూడింతలు అవుతుందట..."

"ఛీ... ఏంటి చిత్రా... ఇప్పుడా అవన్నీ?"

"మరెప్పుడింక?... వాషింగ్ మిషన్ కొందామా?"

"అబ్బా... ముందసలూ.." అంటూ ప్రీతిగా నవ్వుతూ కౌగిలించు కుంటుండగా "పోనీ... రెండు వేల చీటీ అయినా కడదాం" అంది చిత్ర.

ఒక్కసారి విదిలించుకుని చివ్వున లేచి పోయాడు. "ఛీ! నువ్వసలు ఆడదాని వేనా?"

ఆమె గుడ్లనీరు కక్కుతూ ముఖం పగిలేట్టు ఏడ్చింది... "ఏం చేశా నిప్పుడు నేనూ?..."అంటూ మరుసటి క్షణం నుంచీ, అలా ఏడుస్తూనే వుంది.

ఉస్సురని కూల బడ్డాడు గోపీ.

వాళ్ళకు పెళ్ళయి రెండే ళ్ళయింది. బహు ముచ్చటైన జంట అన్నా రందరూ. ఈడూ జోడూ ఆస్తీ అంతస్తూ అన్నీ సరి తూగాయి.

ఎన్నో సంబంధాలు కాదని కోరి కోరి ఆమెనే చేసుకున్నాడు. ఆమె

కూడా అంతే. అతని ఉద్యోగం చిన్నదే అయినా మనిషి బావున్నాడనీ బుద్ధిమంతుడనీ కావాలని అతన్నే ఎంచుకుంది.

ఉద్యోగం పుణ్యమాని పెద్దల పోరు లేని వేరింటి కాపురం! ఎంతో ఒద్దిక గానే ఉంటారు. అంతా బాగానే ఉంది కానీ అసలు సమయం లోనే చెడుతుంది. అతని యాతన అంతా ఇంతా కాదు.

ఎవరికీ చెప్పుకోలే ననుకున్నాడు గాని చివరి కొక రోజు ఆప్త మిత్రుడు బ్రహ్మం దగ్గర గోడు వెళ్ళ బోసుకున్నాడు. "నిజం చెప్తున్నా గురూ... ఇంత వరకూ నేను ఒక్క పూట అయినా... ఐ మీన్ ఒక్క రాత్రి అయినా... హాయిగా గడిపింది లేదు.... తను ఏదో ఒకటి మాట్లాడుతూనే వుంటుంది... అవస్థల మధ్య నా మూడ్ ఆఫ్ అయిపోయి... చిరాకు పడతానంతే..." అన్నాడు నిస్పృహగా.

బ్రహ్మం సానుభూతిగా చూశాడు. "అన్నీ ఇచ్చాక దేవుడు ఏదో ఒక లోటు పెడతాడు. అలంకార మంతా చేసి చివరన దిష్టి చుక్క పెట్టినట్టు..." అంటూ చాలాసేపు అనునయించాడు.

"చూడు గోపీ... నీలాంటి పరిస్థితి వస్తే... ఇదే విదేశాల్లో అయితే సైకియాట్రిస్టల దగ్గరికో, సెక్స్ స్పెషలిస్టుల దగ్గరికో వెళ్తారు. మనమింకా అంత తెలివి మీరలేదు...."

"నువ్వే నా సైకియాట్రిస్ట్ వనుకో... ఏం చెయ్యగలవో చెప్పు?" అన్నాడు గోపీ.

మిత్రుణ్ణి అర్థం చేసుకున్నట్టు నవ్వాడు బ్రహ్మం. "ముందు నీ తప్పు ఏమైనా ఉందేమో చూసుకోవాలి కదా! నా ఉద్దేశం ఏమిటంటే... మీ ఆవిడ ఎక్కువ భాగం ఒంటరి జీవితం గడుపుతోంది... ఆవిడకి ఏ ఆలోచన వచ్చినా చెప్పుకోవడానికి ఇంకెవరూ లేరు... ప్రొద్దున్నే నువ్వు ఆఫీసుకు వెళ్ళిపోతే మళ్ళీ సాయంత్రానికే గూడు చేరటం... మీరిద్దరూ ఏకాంతంగా ఉండడం రాత్రే... ఇక అప్పుడే చెప్తుందావిడ తన ఆలోచనలు, సమస్యలు అన్నీ... తప్పేముంది?... స్త్రీకి శరీరమే కాదు మెదడూ హృదయమూ ఉన్నాయని నువ్వు మరిచి పోతే ఎలా?"

"కరెక్టే!" అన్నాడు గోపీ...."నాకిది తోచనే లేదు. నిజం చెప్పావు. చాలా థాంక్స్!" అంటుండగా అతని ముఖంలో కొత్త వెలుగు కనిపించింది.

మరుసటి రోజు నుంచి సాయంత్రాలు ఇంటికి తొందరగా రావడం మొదలెట్టాడు గోపీ. ఆఫీసు ముగిశాక కొలీగ్స్‌తో కాంటీన్‌కి వెళ్ళడం, బాతాఖానీ

కొట్టడం, దార్లో మిత్రులు ఎదురైతే మాటలు పెంచడం... ఇవన్నీ చాలా మేరకు తగ్గిస్తూ వచ్చాడు.

ఇంట్లో మామూలు కన్నా ఎక్కువ టైము గడిపితే చిత్ర మనసు క్రమంగా మారుతుందని ఆశ.

గోపీలో మార్పు వచ్చినందుకు చిత్ర సంబరపడి పోయింది కాని ఆ మార్పును ఆమె ఇంకో రకంగా ఉపయోగించు కోవడం మొదలెట్టింది.

ఏముంది? సినిమాలకు, మిత్రుల ఇండ్లకి, షాపింగ్‌కి, పార్క్‌కి అలా స్కూటర్ మీద వెళ్ళి రావడం ఎక్కువైంది. అయితే అయింది. మరి కాస్త ఎక్కువ పెట్రోలు కాలుతుంది అంతే కదా అసలు కథ ఎప్పటి కైనా రక్తి కడితే అంతే చాలు ననుకున్నాడు గోపీ.

ఆశించడమే అతని వంతు. చిత్ర మనసు విచిత్రంగా పరుగులు తీయడం మొదలెట్టింది. ఏకాంతంలో ఆ మనసు ఎటువంటి ఆలాపనలు తీసిందంటే... సినిమా తర్వాత ఆ డ్యూయెట్లలో రసవత్తర కదలికల్ని గుర్తు చేసుకుంటూ అతను రెచ్చిపోతుండగా ఆమె అడుగుతుంది.... "అదంతా నిజంగా సింగపూర్‌లో తీసుంటారాండీ? ఎంత ఖర్చు కదూ? ఇద్దరు హీరోయిన్లని ఎందుకు పెట్టారో సినిమాలో?"

"చిత్రా! నువ్వు ఆ హీరోయిన్ల కన్నా వంద రెట్లు సెక్సీగా ఉంటావు తెలుసా? అయితే నీకు సంతోషంగా ఉండడం తెలీదు..." అతని నిస్పృహను కూడా ఆమె ఏమాత్రం పట్టించు కోదు.

"మార్కెట్ దగ్గర షాపింగ్ కాంప్లెక్స్ చూశాం కదా... ఒక్కో షాపుకి ఎంత అద్దె ఉంటుందండీ?..."

"అబ్బ... చంపుతున్నారు... వద్దంటే వినరు... జగదాంబ మన ఫ్రెండే గాని... వొట్టి కుళ్ళు మనిషి.... పొట్ట ఎంత ఎత్తుగా వుందో?..."

"వాసూ మేష్టారింట్లో ముసలావిడ కట్టుడు పళ్ళు పెట్టుకుందిట... ఇబ్బంది కదాండీ వాటితో?..."

"ఇంట్లో ఉన్న పాత పేపర్లు అమ్మేసి టేబుల్ క్లాత్‌లు కొందామా?..."

ఇలా రకరకాల ఐడియాలు చెప్తుండగా గోపీ రసికత్వ మంతా అణగారి పోతోంది యథావిధిగా...

హతవిధీ అనుకుంటూనే మరో పథకం వేశాడు. దీంట్లో పుణ్యమూ పురుషార్థమూ కలిపాడు.

తిరుమలలో దైవ దర్శనం తర్వాత కాటేజీలో చలి మహత్తరంగా అనిపించింది. మూడు రోజుల సెలవులు ముద్దు ముచ్చట్లతో గడిపెయ్య వచ్చనే తిరుపతి ట్రిప్ ప్లాన్ చేశాడు గోపీ. మొదటి రాత్రే చిత్ర టైమంతా వేస్ట్ చేసింది.

"తప్పు కదండీ... దైవ దర్శనానికి వచ్చి మనం... ఎడంగా ఉండా లంతే..." అంటూ మరీ దూరం జరిగింది. దాదాపు గంటన్నర పాటు తన సమయ స్ఫూర్తిని వాక్ చాతుర్యాన్ని ప్రయోగించాడు గోపీ.

ఇది పెళ్ళిళ్ళు జరిగే చోటు. ఇక్కడ నిత్య కళ్యాణం. తప్పుడు పనులు చెయ్య కూడదు గాని దంపతులు విధిగా కలిసి ఉండా లన్నాడు.

భగవంతు డెప్పుడూ కాపురాన్ని కాదన లేదే. అసలాయన భార్యను వెతుక్కుంటూనే కదా భూలోకానికి వచ్చాడు!

మెత్తగా మెల్లగా ఆమెను ప్రసన్నం చేసుకునే సరికి తొలి కోడి ఎక్కణ్ణుంచో కూసేసింది. చలిలో చెలి కౌగిలి స్వర్గమే కదా అని మురిసే వేళలో నిద్ర మత్తును కూడా జార్చేస్తున్నట్టు చిత్ర అడిగింది.

"కొండ మీదికి రైళ్ళు వస్తే ఎలా ఉంటుందండీ?"

"ఓ గ్గాడ్!"

"ఏమైందండీ?..." అంటూనే అతన్ని వెనక్కి తోసేసి దిగ్గుమని లేచి కూచుంది చిత్ర. "ఇంట్లో... గ్యాస్ ఆర్పేనో లేదో... అంటే సిలిండర్ వాల్వు... క్లోజ్ చెయ్యకుండా వదిలేశా నేమో!..."

"ఛీ... ఇంత దూరం వచ్చి కూడా నువ్వు..."

"ఆఁ...మీకేం చెబుతారు... ఏ పందికొక్కో గ్యాస్ ట్యూబ్ కొరికేస్తే... గ్యాస్ లీకయిపోతే..."

"అవన్నీ తర్వాత..." అంటూ ఉండబట్ట లేక ఆమెను పొదువు కున్నాడు గోపీ.

వెచ్చవెచ్చగా ఉన్న ఆమె శరీరాన్ని హత్తుకుని చలిని ధిక్కరించాలని తహ తహ. నరనరం బిగిసిన వీణలా తుళ్ళి పడుతోంది. కాని...

"ఏమండీ... ఎక్కణ్ణుంచి అయినా మన పక్కింటి ఆంటీకి ఫోన్ చేసి... మన తలుపుల దగ్గర వాసన చూడ మందామా?... కాని గ్యాస్ లీక్ అయి ఉంటే... ఏం చెయ్యాలి?" అంది చిత్ర.

"సింపుల్! తగలెయ్య మనాలి!" కసిగా దుప్పటి ఉండ చుట్టి విసిరి

కొట్టాడు గోపీ. "నువ్వసలు ఆడ దానివి కావు. రాక్షసి వైనా కావు. శూర్పణఖ, హిడింబి లాంటి రాక్షస స్త్రీల క్కూడా రొమాన్స్ తెలుసని పురాణాలు చెప్తున్నాయి. తిడితే తిట్టా నంటావు... నీదసలు ఏం జన్మ?... ఛీ..." అంటూ కళ్ళలో నిప్పులు కురిపించాడు గోపీ. ఆ తర్వాత అసహాయంగా మంచంపై వాలి పడి నిద్రపోయాడు.

అతను నిద్రలోకి జారుతుండగా చిత్ర ఏడుపు, వెక్కిళ్ళు వినిపిస్తూనే ఉన్నాయి...

"వీలైతే విడాకు లిచ్చెయ్యా లనుకుం టున్నాను" అంటూ ముఖం ధుమధుమ లాడిస్తున్న గోపీ వంక చూస్తూ తమాషాగా నవ్వాడు బ్రహ్మం.

"నిన్ను చూస్తుంటే నా చిన్న తమ్ముడు గుర్తొస్తున్నాడు గోపీ. వాడూ ఇంతే.... చిన్నప్పుడు బొంగరం వేసేవాడు. అది సరిగ్గా తిరక్కపోతే... దాని తప్పయినట్టు విసిరి కొట్టేవాడు..."

"ఏమిటి నీ ఉద్దేశం... భార్య బొంగర మనా?..."

"ఉపమానం బొంగరానికి కాదు... నీ ధోరణికి... నువ్వు చెప్పినట్టు విడాకుల దాకా వెళ్ళేట్టయితే ఇండియాలో కాపురాల కన్నా విడాకులే ఎక్కువగా ఉండాల్సింది..." అన్నాడు బ్రహ్మం.

"సో...వాట్?" అన్నాడు గోపీ ధిక్కారంగా. "అందమైన భార్య అని అందరూ అనుకోవాల్సిందే! నాకు ఆనందమే కరువైతే ఈ పెళ్ళే వృథా!"

"ఒక పాయింటుంది గోపీ... ఆమె ఆనందం గురించి నువ్వేం ఆలోచించావు?..."

"ఎప్పుడూ వాగుతూ ఉండడమే తనకి ఆనందం... అంతే!... జోకులకేం గాని... డైవర్స్ వీలవ దంటావా?" సీరియస్‌గా అడిగాడు గోపీ.

"ఫారిన్‌లో అయితే గెడ్డం చేసుకోకున్నా, గోళ్ళు కట్ చేసుకోకున్నా, పొట్ట కాస్త పెద్ద దయినా డైవర్స్ అడుగుతారూ... తీసుకుంటారు... మన మింకా అంత పతనమై పోలేదులే!" అన్నాడు బ్రహ్మం.

"పతనమేమిటి?... నాగరికత అంటే అంత సెన్సిటివ్‌గా ఉండాలి" అన్నాడు గోపీ.

"ఆహా!... అంత సెన్సిటివ్‌గా ఉంటేనే ఆ దేశాల్లో తల్లీ దండ్రీ ఎలా ఉంటారో ఎరగని పిల్లలు ఎక్కువవు తున్నారు.... తల్లికి భర్త లెందరో గుర్తు

పెట్టుకోవడంతో సరిపోతుంది...."

"సోది ఆపుదూ! నా సమస్యకి మాత్రం పరిష్కారం చెప్పలేవు!" అన్నాడు గోపీ నిష్ఠూరంగా.

ఎప్పుడూ లేనంత నిస్పృహతో భుజాలు ఎగరేశాడు బ్రహ్మం...."సారీ గోపీ.... నేను నీకు మిత్రుణ్ణే కానీ... అంతకన్నా ఎక్కువా కాను తక్కువా కాను... ఆహార నిద్రా భయ మైథునాదులు స్వయంగా చేసేవి... ఇతరులు చెప్పి చేయించేవి కావు. ఒక్కటి మాత్రం చెప్పగలను. ఇది జీవన సూత్రం... ఏ సమస్యకైనా పరిష్కారం... ఆ సమస్య లోపలే ఉంటుంది. నువ్వే ఆలోచించు... గుడ్ లక్!..."

రోజంతా ఆలోచిస్తూ ఉండి పోయాడు గోపీ... సమస్య...పరిష్కారం అనేసరికి ఎక్కడో ఎప్పుడో చదివిన ఒక అద్భుతమైన వాక్యం గుర్తొచ్చింది.

అసలు సమస్యలే లేవు. పరిష్కారాలే సమస్యల వేషం వేసుకుని వస్తుంటాయి.

నిజమా?

ఇల్లు చేరినా చిత్రతో సరిగ్గా మాట్లాడ కుండా తల నొప్పిగా ఉందని పడుకునేసి ఆలోచిస్తూనే గడిపాడు గోపీ. చిత్ర బలవంతాన స్నానం చేసి భోంచేశాడు గాని ఆలోచన వదల్లేదు. చాలా సేపటికి....ఒకే ఒక్క మెరుపు లాంటి ఆలోచన మెరిసింది.

చిన్న మెలిక. అంతే.

పడగ్గదికే పరిమళాన్నిస్తూ ప్రవేశించింది చిత్ర "పడుకోండి పాపం... తలనొప్పి అన్నారుగా..." అంటూ వచ్చి మెల్లగా కణతలు నొక్కింది.

కళ్ళు మూసుకుంటూనే చిన్నగా డైలాగు మొదలెట్టాడు గోపీ. ఆఫీసు పనిలో చిరాకూ బాస్ గాడిద చీదరింపులూ అన్నీ ఏకరువు పెట్టాడు.

చిత్ర అతనివైపు జాలిగా చూస్తూ "ష్! అలిసిపోతారు ఊరుకోండి" అనగానే గోపీ ఇంకా సాగ దీశాడు. "పోనీ... వేరే జాబ్ చూసుకోనా? మంచి బిజినెస్ ఏదైనా ప్లాన్ చేద్దామా! చిన్న ఫర్నిచర్ షాప్ పెట్టుకుంటే! మన వ్యాపారానికి మనం ఎంత చాకిరీ చేసినా ఫరవాలేదు... ఎవరి దగ్గరా మాటలు తినక్కర్లేదు..."

"నిజమే కాని... మీరు మరీ వర్రీ అవకండి... ఉద్యోగం మానెయ్యా లనుకుంటే దర్జాగా మానెయ్యండి..." అంటూ గోపీ తలని గుండెల కేసి పొదువు

కుంది. మబ్బుల్లో తేలి పోయింది గోపీ మనసు. ఇక రాజుకుంది మధుర కవిత్వం.

“ప్రతి పురుషుడి విజయం వెనుకా స్త్రీ ఉంటుం దంటారు... వెనుకేమిటి? నువ్వెప్పుడూ ముందే ఉంటావు కదూ!...” అని అతను పొగుడు తుండగా ఆమె మధుర మోహనంగా నవ్వుతూ...

“వేరే చెప్పాలా? మీరు నెమ్మదిగా ఉండండి” అని మెల్లగా పైకి తీసుకుంది అతన్ని. ఆ చేతుల్ని వదలకుండా గుండెల మీద చేర్చుకుంది.

“చిత్రా... టాటా బిర్లాలు అంత గొప్పవాళ్ళు ఎలా అయ్యా రంటావ్? పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న ధీరూభాయ్ అంబానీ విమల్ ఫ్యాబ్రిక్స్ సామ్రాజ్యాన్ని ఎలా స్థాపించాడు? ఎలా పెంచి పెద్ద చేశాడు?... అసలు పరిశ్రమల వల్లే కదా సంపద పుడుతుంది....”

సున్నితంగా అతని పెదవి మీద తన పెదవితో స్పృశించింది. అమృత భాండం అంచు తగిలింది.

“మీరు ఇంకా గొప్ప గొప్ప పనులు చెయ్యొచ్చు కాని... ఊరుకోండి...”

“మనం బిజినెస్ ప్లాన్ చేస్తే ఫారిన్ మార్కెట్‌ని దృష్టిలో పెట్టుకోవాలి... అదేం బ్రహ్మ విద్య కాదు.... ఎగుమతి చెయ్యడానికి వడియాలు చాలు!...”

కదిలే అతని పెదవుల్ని పూర్తిగా పెదవుల్తో కట్టేసింది చిత్ర. చాలా సేపటికి పెదవుల వారగా మాట పెగిల్చి చెప్పింది....“ఇక మీరు మాట్లాడితే మాత్రం నా మీద ఒట్టు..... ఈ రాత్రంతా!...”

అతని కళ్ళలో భావాన్ని తళుక్కున చదివేసింది. “ఎవరూ మాట్లాడ కూడదంతే!...”

అంతే మరి, ఒట్టు నిలిచింది. ఒట్టు!

03.10.1997 సంచిక